క్లుప్తంగా

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



పామర్రు: వారం రోజులుగా నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రితో ముగిశాయి. టీటీడీ ఆధ్వర్యంలో ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామికి ఆలయంలో తొలుత ద్వాదశ ప్రదక్షిణాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసమూర్తికి డోలోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులతో సహస్ర దీపాలంకరణ సేవ జరిపించారు. అనంతరం ఆచార్య సన్మానం నిర్వహించి, ఆచార్యులను గౌరవించారు. ఆలయంలో పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు సుదర్శనం యోగానంద లక్ష్మీ నరసింహాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ముగిసిన శిక్షణ తరగతులు



గుడివాడ టౌన్: ప్రైవేట్ ఆస్పత్రులలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో జరిగిన మూడు రోజుల శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ జె.ఆంజనేయులు మాట్లాడుతూ స్థానిక ఐఎంఏ హాల్లో పట్టణానికి చెందిన ప్రైవేట్ ఆస్పత్రి సిబ్బందికి అగ్నిప్రమాదాలు సంభవించే పరిస్థితులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణోపాయాలు, సమయస్ఫూర్తిగా వ్యవహరించాల్సిన తీరుపై శిక్షణ ఇచ్చామన్నారు. పలు విధాల అగ్ని ప్రమాద నివారణను ప్రయోగాత్మకంగా వివరించామని తెలిపారు. శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ పాలడుగు వెంకట్రావు, కార్యదర్శి డాక్టర్ పిన్నమనేని రామకృష్ణ, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

వడాలి ప్రజలకు తాగునీరు సరఫరా



ముదినేపల్లి రూరల్: మండలంలోని వడాలి ప్రజలకు తాత్కాలికంగా తాగునీటి సమస్య పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు రెండు రోజులుగా పంచాయతీ ఆధ్వర్యంలో ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. కలుషితమైన నీరు తాగుతూ అనారోగ్యాల బారిన పడుతున్నామని పరిశుభ్రమైన తాగునీరందించాలని కోరుతూ ఈ నెల 21న ముదినేపల్లి–బంటుమిల్లి రహదారిపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామంటూ హామీ ఇచ్చారు. ఈ మేరకు ఎంపీడీఓ మురళీ గంగాధరరావు, ఈఓపీఆర్డీ దూలం లక్ష్మీనారాయణ ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేసి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేశారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ రోడ్ నుంచి ఎస్టీ కాలనీ వరకు నివాసితులకు తాగునీరు సరఫరా చేస్తున్నట్లు సర్పంచ్ మరీదు దుర్గశ్రీ, కార్యదర్శి జి.రమేష్ తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

గుడివాడ టౌన్: ఆర్టీసీ ప్రయాణికులు తమ సమస్యలను తెలుసుకునేందుకు, ఆర్టీసీకి సూచనలు, సలహాలు ఇచ్చేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ జి. రాజేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఫిర్యాదు చేయదలచిన వారు 99592 25464కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

వ్యవసాయ మోటార్ హెడ్, పైపులు మాయం

పామర్రు: వ్యవసాయానికి వినియోగించే మోటార్ పంపు హెడ్, బెండు పైపులు గుర్తుతెలియని వ్యక్తులు తీసుకెళ్లారని పామర్రు పోలీస్స్టేషన్లో బుధవారం కేసు నమోదైంది. పామర్రు గ్రామానికి చెందిన మేడిశెట్టి వీర వెంకటేశ్వరరావుకు బైపాస్ రోడ్డు పక్కన చెన్నువానిపురం శివారు వద్ద మెట్ట పొలం ఉంది. దానిలో 5–హెచ్‌పీ మోటారు ఏర్పాటు చేసుకున్నారు. ఈ నెల 24వ తేదీ రాత్రి దుండగులు మోనోబ్లాక్ మోటార్ హెడ్, బెండు పైపులను దొంగిలించారు. వెంకటేశ్వరరావు బుధవారం ఉదయం వెళ్లి చూడగా వస్తువులు చోరీకి గురయ్యాయని గుర్తించారు. దీంతో వెంకటేశ్వరరావు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై తగు చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

లో 'పాలు' సరి చేసుకుంటే ఆర్థిక ఉన్నతి

పాల ఉత్పత్తిదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు



పాడి పశువు నుంచి పాలు పితుకుతున్న వ్యక్తి

పామర్రు: ప్రస్తుతం పాల ఉత్పత్తులకు డిమాండ్ బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో పాడి రైతులు పాలు పితికే సమయంలో, వాటిని కేంద్రాలకు తరలించే సమయంలో కొన్ని జాగ్రత్తలను పాటిస్తే అధిక దిగుబడులతో పాటు ఆర్థిక ఉన్నతి సాధించవచ్చని పశుసంవర్ధక శాఖ పామర్రు సహాయ సంచాలకులు సీహెచ్ శశికుమార్ తెలిపారు. పాలు తీసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

- పాలు పితికడానికి ముందు నేలను ఊడ్చి నీటితో కడగాలి.
- చుట్టు పక్కల బురద కాలువలు, పేడ కుప్పలు ఉండరాదు.
- పాలు పితికే ముందు పాడి పశువును గోరు వెచ్చని నీటితో కడగాలి. పొదుగును శుభ్రంగా కడగాలి. అలా కుదరకపోతే పొదుగును కడిగి పొడి గుడ్డతో తుడవాలి.
- పాలు పితికే వ్యక్తి చేతులను సబ్బుతో శుభ్రంగా కడుగుకోవాలి.
- తడి చేతులతో పాలు పితకరాదు. మధ్యలో చేతులు తడి చేసుకోరాదు.
- ముందు పితికిన పాలతో సూక్ష్మజీవులు ఎక్కువగా ఉండి, వెన్న శాతం తక్కువగా ఉంటుంది. కాబట్టి ముందు పాలను దూడకు వదలాలి. వెనుక తీసిన పాలను కేంద్రానికి పోయాలి.
- స్టీలు, అల్యూమినియం పాత్రలనే వాడాలి. ఇనుప పాత్రలు వాడితే పాలు త్వరగా చెడిపోతాయి.
- వెచ్చటి వాతావరణంలో సూక్ష్మజీవులు బాగా వృద్ధి చెంది పాలలోని చెక్కరను ఆమ్లంగా మార్చి పాలు త్వరగా చెడిపోతాయి. – 25 నుంచి 50 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలో సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి.
- పాలను నిల్వ చేయడానికి తినే సోడా(సోడియం బై కార్బనేట్), చాకలి సోడా (సోడియం కార్బనేట్)ను పాలతో కలుపరాదు.
- పాలల్లో నీళ్లు కలపడం వల్ల వెన్న శాతంతో పాటు మిగిలిన ఘన పదార్థాలు కూడా తగ్గిపోతాయి. దీంతో పాల రేటు కూడా తగ్గిపోతుంది.
- పాలు చుట్టు పక్కల గల వాసనను వెంటనే గ్రహిస్తాయి. కాబట్టి ఉల్లి, వెల్లుల్లి, ఎండు చేపల వాసన, మురుగునీటి వాసన వస్తే పాలు ఆ వాసనను గ్రహించి పులిసిన వాసన పాలకు వస్తాయి.
- పాలు పితికిన వెంటనే శుభ్రమైన క్లాత్‌తో వడకట్టాలి.
- రాత్రి తీసిన పాలతో తాజా పాలు కలపరాదు. తాజా పాలు కొంచెం తియ్యటి వాసన కలిగి ఉంటాయి.
- గేదె ఈనిన 15 రోజుల వరకూ పాల కేంద్రాలకు పాలను పోయకూడదు. జున్ను పాలు కలిస్తే మంచి పాలు కూడా చెడిపోతాయి.
- పాలల్లో ఎరుపుజీర, తరకలు కనిపిస్తే పొదుగు వాపుగాని, గాయము గాని ఉండి ఉండవచ్చు. వెంటనే పశువైద్యుడిని సంప్రదించాలి.
- పాలు పూర్తిగా పితకకుండా మెల్లమెల్లగా నగం వరకే పితికినా తక్కువ వెన్న శాతం వస్తుంది.

పై నియమాలను పాటించి పాలను సేకరిస్తే పాలకు మంచి వెన్న శాతం ఏర్పడి ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయి.

జాగ్రత్తలు వహిస్తే ఆర్థిక లబ్ధి

పాడి పశువుల నిర్వహణలో జాగ్రత్తలు వహిస్తే మంచి పాల దిగుబడితో పాటు ఆర్థిక లబ్ధి కూడా చేకూరుతుంది. పశువుల పాకల వద్ద శుచి శుభ్రతగా ఉంచితే పశువులు ప్రశాంతంగా ఉండి మంచి వెన్నశాతం ఉన్న పాలను ఇస్తాయి. దీని వలన వెన్నశాతం అధికంగా వచ్చి పాలకు మంచి రేటు వస్తుంది.

– శశికుమార్, ఏడీ, పామర్రు

అందరికీ అండగా ఉంటా

పామర్రు మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్



నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు: ఎవ్వరూ అధైర్య పడవద్దని.. అందరికీ అండగా ఉంటామని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, మండల సచివాలయ కన్వీనర్లు, ముఖ్య నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ త్వరలో నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతికార్యకర్తకూ అందుబాటులో ఉంటానన్నారు. నియోజవకర్గంలోని ప్రజా సమస్యలపై పోరాటం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, కళ్లం వెంకటేశ్వరరెడ్డి, రాజుల పాటి రాఘవరావు, యలమంచిలి గణేష్ జెడ్పీటీసీ సభ్యులు జొన్నల రామ్మోహనరెడ్డి, రాజులపాటి పార్వతి, ఏనుగు వెంకట రమణకుమారి, ఎంపీపీలు దాసరి అశోక్‌కుమార్, ఈడ్పుగంటి రాజామణి, కొండేటి ఇందిర, గోగం సురేష్, కాసాని వేద సుప్రజ, సచివాలయ కన్వీనర్లు ఎం.సురేష్‌రెడ్డి, నడకుదురు రాజేంద్ర, సమ్మెట ఆంజనేయులు, జాజుల చిన్నారి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన



కైకలూరు: మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో మాదక ద్రవ్యాల వాడకం వలన కలిగే దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.సాయి సత్యానారాయణ, సెక్రెటరీ ఎంఎస్ఎస్ రాజు, అడ్వొకేట్ పి.పవన్‌కాంత్, ఏఎస్సై మల్లికార్జునరావు, కళాశాల ఇన్‌చార్జి కె.జయలక్ష్మి, సిబ్బంది, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి



కొమరవోలులో గ్యాడ్యుయేషన్ డే



గరికపర్రులో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే

కొమరవోలు(పామర్రు): మూడేళ్ల నిండిన చిన్నారులను తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని గ్రామ సర్పంచ్ దిరిశం రత్నకుమారి అన్నా రు. పామర్రు మండలం కొమరవోలు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలని గ్రామంలో తొలుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐదేళ్లు పూర్తి చేసిన చిన్నారులకు సర్టిఫికెట్లను అందజేసి స్థానిక ప్రభు త్వ పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎస్.విజయకుమారి, జీవిత, సీహెచ్ కృష్ణమనున్య, అంగన్‌వాడీ కార్యకర్తలు డి.ప్రసన్న పావని, ఎం.రూతు, జీ ప్రమీలారాణి పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: అంగన్‌వాడీ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే నాగమల్లేశ్వరి సూచించారు. మండలంలోని గరికపర్రు–2 అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ పిలుస్తోంది, గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలు బుధవారం ఘనంగా జరిగాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందించటంతోపాటు చదువు, ఆటలు, పాటలపై అవగాహన కలిగిస్తున్నట్లు నాగమల్లేశ్వరి తెలిపారు. మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చుకోవటంతోపాటు ఐదేళ్లు నిండిన వారికి గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి పాఠశాలలకు పంపుతున్నట్లు పేర్కొన్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శి ఆశా ప్రియాంక, ఏఎన్ఎం లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు వీరంకి రమాదేవి, మంచాల రాధిక, ఎం.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

లంకపల్లిలో..

పమిడిముక్కల: మండలంలోని లంకపల్లి అంగనవాడీ కేంద్రంలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి అంగనవాడీ కేంద్రాలలో అందించే సేవలను వివరించారు. ఏఎన్ఎం వసంతకుమారి డయేరియా ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ఐదేళ్లు నిండిన చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేసి ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వేమూరి రత్నకుమారి, కార్యదర్శి విజయలక్ష్మి, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు ఫ్రీ బస్ సౌకర్యం ఎప్పటి నుంచి కల్పిస్తారు?



డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎం హనుమంతరావు

అవనిగడ్డ: ఆర్టీసీలో మహిళలకు ఫ్రీ బస్ సర్వీసు ఎప్పటి నుంచి కల్పిస్తారని వక్కలగడ్డకు చెందిన జి.శేషు డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో డీఎంను ప్రశ్నించారు. స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ డిపో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఒక ప్రయాణికుడు అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే అమలు చేస్తామని డీఎం చెప్పారు. మచిలీపట్నం నుంచి నాగాయలంకకు బస్సు సర్వీసులు పెంచాలని, ద్వారకా తిరుమల, నరసాపురం ప్రాంతాలకు బస్సులు నడపాలని, అవనిగడ్డ వయా ఘంటసాల మీదుగా గుడివాడకు, చల్లపల్లి ఘంటసాల వయా కొడాలి మీదుగా షటిల్ సర్వీసులు నడపాలని కోరారు. చల్లపల్లి బస్టాండ్‌లో స్టూడెంట్స్‌కు బస్ పాస్ కౌంటర్ ఏర్పాటు చేయాలని, తీర ప్రాంత గ్రామాలు సొర్లగొంది, గుల్లలమోద, పాత ఉపకాలి నుంచి అవనిగడ్డకు వచ్చే సర్వీసులను రేపల్లె వరకూ పెంచాలని, కోడూరు నాగాయలంక మీదుగా అవనిగడ్డకు షటిల్ సర్వీసులు నడపాలని, అవనిగడ్డ– రేపల్లెకు సర్వీసులు పెంచాలని, గుడివాడ నుంచి అవనిగడ్డకు, అవనిగడ్డ నుంచి గుడివాడకు లాస్ట్ సర్వీసు 8 గంటలకు పెంచాలని, రేపల్లె రైల్వే స్టేషన్ వద్ద బస్సులు ఆపేలా చూడాలని, కోడూరు సెంటర్‌లో బస్ టైమింగ్ బోర్డులు ఏర్పా టు చేయాలని, చల్లపల్లి నుంచి పెదకళ్ళేపల్లి రాత్రి సర్వీసు వేళలు పెంచాలని కోరారు. వీటన్నింటినీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటామని డీఎం హనుమంతరావు తెలిపారు.

గురుకులం ప్రాంగణంలో దోమల మందు పిచికారీ

కోనేరుసెంటర్: బందరు మండలం చిన్నాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ గురుకులం ప్రాంగణంలో బుధవారం దోమల నివారణ మందును పిచికారీ చేశారు. మండల పరిధిలోని పలు వసతి గృహాల్లో పాఠశాలలు పునః ప్రారంభం అయిన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది మలాథియాన్ మందును పిచికారీ చేయించారు. కార్యక్రమంలో పాల్గొన్న మలేరియా ఆసుపత్రి ప్రతినిధి పి.మురళి మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా లేకుంటే అనేక రకాల దోమలు వ్యాప్తి చెందేందుకు అవకాశం ఉంటుందన్నారు. దోమ కాటు వలన మలేరియా, ఫైలేరియా, డెంగీ వంటి రోగాలు ప్రబలుతాయన్నారు. విద్యార్థులు వాటి బారిన పడకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు దోమల మందును పిచికారీ చేస్తున్నట్లు తెలిపారు. వసతి గృహాలు, విద్యాసంస్థల నిర్వాహకులు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గురుకులం పాఠశాల ప్రిన్సిపాల్ జాన్ కెనడి, చిన్నాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్ వైజర్ సింహాద్రి రాంబాబు, ఏఎన్ఎం నాగలక్ష్మి, ఆశా వర్కర్ ధర్మజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

మండవల్లి: విద్యార్థులు ఉత్తమ విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎంఈఓ డి.రామారావు అన్నారు. గన్నవరం ఎంపీపీ స్కూల్, 1,2 అంగన్‌వాడీ సెంటర్లలోని విద్యార్థులకు ఎన్డీఏ నాయకుల ఆర్థిక సాయంతో నోటు పుస్తకాలు, పెన్నులు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జి.శ్రీను, టి.రమేష్, వి.శివయ్య, హెచ్ఎం పి.పాండురంగారావు, ఎం.పావని, జి.పవన్ కుమార్, నాని, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం క్షేమం

ఘంటసాల: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం క్షేమంగా ఉంటుందని చల్లపల్లి ఏరియా కోఆర్డినేటర్ ఎం.మధు అన్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో ఘంటసాల మండల ఏపీఎం బి.అమరేశ్వరరావు అధ్యక్షతన ఘంటసాల వెలుగు కార్యాలయంలో విజయశ్రీ మండల మహిళా సమైఖ్యలో పనిచేస్తున్న 42 మంది వీఓఏలకు ఆహారం – పోషణ – ఆరోగ్యం – పారిశుద్ధ్యంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. కార్యక్రమంలో పాల్గొన్న ఏసీ మధు మాట్లాడుతూ ఆహారపు అలవాట్లు, పౌష్టికాహారం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతి ఒక్క వీఓఏ ఆహార పోషణ కోసం వారి ఇళ్ల వద్ద పెరటి తోటలు పెంచుకుని పశువుల పేడ, ఇతర సేంద్రియ ఎరువులతో పండించుకోవాలని సూచించారు. ప్రతి మహిళ తమ సమీపంలోని పీహెచ్‌సీల్లో డాక్టర్లు, వైద్య ఆరోగ్య సిబ్బందితో నెలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర వైద్య సేవల గురించి వారికి అవగాహన కల్పించాలన్నారు. గురువారం నుంచి డ్వాక్రా సంఘాల అధ్యక్షులకు శిక్షణ ఇస్తామని చెప్పారు.

మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

ఉంగుటూరు: కాలనుగుణంగా మారుతున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ సరికొత్త ఆవిష్కరణలు రూపొందించే దిశగా విద్యార్థులు సిద్ధపడాలని ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ సీఈవో టి.అనిల్ కుమార్ అన్నారు. ఉంగుటూరు మండలం తేలప్రోలులోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో ది ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ తరగతులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్నోవేషన్ సొసైటీలో ఆవిష్కరణలకు సంబంధించిన స్టార్టప్స్, ఎంటర్ ప్రెన్యూర్, ఇన్నోవేటర్స్, స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. ఇన్నోవేషన్ సొసైటీలో సదుపాయాలు, అవకాశాలు సద్వినియోగించుకోవాలని కోరారు. ఈ శిక్షణా తరగతులకు రిసోర్స్ పర్సన్లుగా కృష్ణ సౌజన్య, ఏఆర్ చౌదరి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం, ప్రిన్సిపాల్ ప్రసాద్ పాల్గొన్నారు.

నీటితీరువా గ్రామ సచివాలయాల్లో చెల్లించండి



సమీక్ష సమావేశంలో తహసీల్దార్ హరనాథ్, వీఆర్వోలు

నాగాయలంక: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం నీటితీరువా (శిస్తు వసూళ్లు)అంశాలపై తహసీల్దార్ ముప్పిరిశెట్టి హరనాథ్ వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నీటితీరువా చెల్లించవలసిన రైతులు సమీప సచివాలయాలకు వెళ్లి సంబంధిత డిజిటల్ అసిస్టెంట్‌ల వద్ద తీరువా చెల్లించి రసీదులు పొందాలని చెప్పారు. వీఆర్వోలు, వీఆర్ఏలు అందుకు తగిన విధంగా రైతులకు అవగాహన కలిగించాలని సూచించారు. శ్రీరామపాద క్షేత్రం ఘాట్, నిర్మాణాలు పరిశీలించిన తహసీల్దార్ తహసీల్దార్ హరనాథ్ బుధవారం సాయంత్రం శ్రీరామపాద క్షేత్రం ఘాట్, నదీ పరీవాహక ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఘాట్‌లో నిర్మాణం తుది దశలో ఉన్న పర్యాటక శాఖకు చెందిన ఫుడ్‌కోర్టు భవనం, నిర్మాణ దశలో నిలిచిపోయిన జలక్రీడల(వాటర్ స్పోర్ట్స్) కేంద్ర భవనం, ఫిషరీస్ స్టోర్ బేస్డ్ భవనం పనులు ఏ స్థాయిలో ఉన్నాయో పరిశీలించారు. కార్యాలయ ఉద్యోగులు, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొని అక్కడి విశేషాలను వివరించారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



విద్యార్థులతో ర్యాలీ నిర్వహించిన సీఐలు ఏసుబాబు, రామ్మోహనరావు, కరుణప్రియ

గుడివాడరూరల్: మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని వన్‌టౌన్ ఇన్‌చార్జి, గుడివాడ తాలూకా సీఐ కె.ఏసుబాబు పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గుడివాడ సబ్ డివిజన్ పోలీస్‌శాఖ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోల ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ పర్యవేక్షణలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడి క్షణికావేశంలో యువత నేరాలకు పాల్పడుతున్నారన్నారు. మాదకద్రవ్యాల విక్రయించే వారిపై ఉక్కుపాదం మోపేందుకు పోలీస్‌శాఖ ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. విద్యార్థి దశలో చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అదేవిధంగా మత్తు పదార్థాలకు బానిసలుగా మారకుండా ఉండాలన్నారు. క్రమ శిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. గుడివాడ సబ్ డివిజన్‌లో ఎక్కడైనా నిషేధిత గంజాయి, డ్రగ్స్, కొకైన్, హెరైన్ తదితర మత్తు పదార్థాలు విక్రయిస్తే ఆయా ప్రాంతాల్లో ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సూచించారు. ఎవరైనా విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐలు కె.రామ్మోహనరావు, కరుణప్రియ, వన్, టూటౌన్, గుడివాడ తాలూకా పోలీసులు పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కై కలూరు టౌన్ సీఐ ఆకుల రఘు అన్నారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కైకలూరులో మాదక ద్రవ్యాల వినియోగం పై అవగాహన ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు యువతను పీల్చి పిప్పి చేస్తూ సమాజానికి దూరం చేస్తున్నాయన్నారు. వీటి వలన పలు అనర్థాలు జరుగుతూ శాంతి భద్రతల సమస్య ఏర్పడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పోలీసు సిబ్బంది, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సుజాత, వైస్ ప్రిన్సిపాల్ డి.ఉదయ ప్రకాష్, రెడ్ క్రాస్‌కో ఆర్డినేటర్ ఎం.హరిప్రసాద్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ఎన్.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కుక్కల స్వైర విహారం



కైకలూరులోని ఓ వీధిలో గుంపుగా ఉన్న కుక్కలు

కైకలూరు: కుక్కల గుంపులు కైకలూరు ప్రజలను భయపెడతున్నాయి. ఒంటరిగా నడుస్తూ వీటి కంట పడితే కండలు పీకేస్తున్నాయి. పెద్దలు సైతం వీటి సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. పంచాయతీ సిబ్బందికి సమస్య తెలియజేస్తున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. పెద్దలను కరిస్తే కాని పట్టించుకోరా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రధానంగా సంత మార్కెట్‌లో కుక్కల సంచారం అధికంగా ఉంది. ఆ ప్రాంతంలో వేట, కోడి, చేపల దుకాణాలు ఎక్కువగా ఉండటంతో అక్కడ విపరీతంగా సంచరిస్తున్నాయి. సమీపంలోని ఓరియంటల్, నేషనల్ స్కూల్స్ ఉన్నాయి. రోజు అటుగా వెళుతున్నా విద్యార్థులపై ఇవి దాడి చేస్తున్నాయి. అదే విధంగా వైఎస్సార్ కాలనీలో కుక్కల బెడద అధికంగా ఉంది. వీటిని నిరోధించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ సెక్రటరీ ఆదిరాజు వెంకటేశ్వరరావును వివరణ కోరగా కుక్కలను చంపితే జంతు హింస చట్టాల ద్వారా కేసులు నమోదు చేస్తున్నారన్నారు. వీటిని నియంత్రణపై ఉన్నతాధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: కానూరులో విద్యార్థి అదృశ్యంపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు టీసీఆర్ కాలనీకి చెందిన లింగాల జోజి కానూరులో కార్పొరేట్ కాలేజీలో వంట పని చేస్తాడు. అతనికి భార్య ఇద్దరు పిల్లలు. అయితే అతని కుమారుడు (17) అదే కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. అతను తరచుగా ఫోన్‌లు చూడటంతో లింగాల జోజిని కాలేజీ యాజమాన్యం పిలిచి అతని కుమారుడిని కొద్ది రోజులు ఇంటి వద్ద ఉంచుకోమని తెలిపారు. దీంతో జోజి తన కుమారుడిని కాలేజీ బయటకు తీసుకు వచ్చి మందలించాడు. జోజి ఇంటికి బయలుదేరి వెళ్లగా కాలేజీ బయటకు వచ్చిన అతని కుమారుడు ఇంటికి రాలేదు. దీంతో కుమారుడి కోసం వెతకగా జాడ తెలియలేదు. ఈ ఘటనపై జోజి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.